సోమయాజుల వేంకట రామమూర్తి గారు, బి. ఏ., యల్. టి.

సరస్వతి—"శ్యామలా! శ్యామలా!"

(లోపలినుండి)—"ఏమమ్మా."

సర—"లోపల నేమి చేయుచున్నావు?"

శ్యామల సత్వరంబుగ తల్లి నద్దకు నచ్చి సవినయముగా "నే నాలోచించు చుంటిని" అనెను.

"ఏమాలోచించు చుంటివి?" అని మాతృ ప్రేమతో ప్రశ్నించెను.

"కరికరివిధములు నా ఆలోచనను కలుగు లిఱుచున్నది. మొన్న నా యింటికాలము నాయనగారు వెంకడిని శిక్షించిన విషయమై నే నాలోచించుచుంటిని. పాపము, వాడు నిరపరాధియని నానమ్మకము. వెండిగిన్నె సమాచారము వానికేమియును తెలియదని నేనూహించుచున్నను. ఒకవేళ నాయనగారు అనినట్లు నిజముగా వాడే దొంగతనముచేసియుండినచో వాడు ధైర్యముగా నాయనగారి నెదుర్కొని స్పష్టముగ, తడబడక, కొంచమైనను వెనుక దీయక, భీతిల్లక నాయనగారి ప్రశ్నలకు ప్రత్యుత్తరము లొసంగి యుండగల్గునా? నిజముగా వెంకడు నిరపరాధి. దోషి తనదోషమునకు బహుభంగుల భీతిజెందుచుండును. వానియంతరాత్మ వానిని వేధించుచుండును. మానవు డొకడు నిజముగా దోష మొనర్చినను వానియంతరాత్మయే వానికి తగినశిక్ష నొసంగును. వేరుగ శిక్ష అవసరములేదు. కాని వెంకడివిషయమై నాకు తోచినంతవరకును ఎట్టియనుమానమును లేదు. నాయనగారు సరిగా యోచింపక వానినేల దండించి, తిట్టిరో నాకు తెలియకున్నది. వెంకడిని తలచికొనినచో నాకు జాలి యగుచున్నది."

సర—"వెండిగిన్నె వెంకడు తీయకున్న మరి తీసినదెవ్వరు? దయ్యము మెత్తుకొనిపోయెను కదా! ఇంతకును నాయనగారిచేష్టలకు నన్ను ప్రశ్నించిన నే నేమిచెప్పగలను? నీకు ధైర్యమున్నచో పోయి ఆయననే ప్రశ్నింపుము."

శ్యామల—"సరే, క్రమముగా అట్లే చేయుదును."

శ్యామలముఖ మెర్ర వారెను. కన్నులశ్రుపూరితము లయ్యెను. కంఠము తనసహజమాధుర్యమును గోల్పోయెను. గిర్రున తిరిగి యింటిలోనికి జొచ్చెను. తల్లి విస్మితురాలయ్యెను. నిశ్చలయై శ్యామల వెనువెంటనే చూపులం బరపుచు నిలిచియుండెను.

2

వెంకడు రామారావు పంతులుగారి యింట్లో పాతిక యేండ్ల నుండియును నమ్మకముగా పనిచేయుచుండిన నౌకరు. సరస్వతి కాపురమునకు రాకపూర్వమునుండియు వాడు రామారావుపంతులుగారియింట నౌకరుగా నుండెను. శ్యామల బాల్యమునుండియు వాడామెను ముద్దుగా, ప్రేమపూర్వకముగా, ఆటలాడించుచు, పాటలు పాడుచు, భుజముపై

నెక్కించుకొనుచు, వీథిలో దృశ్యములు చూపుటకై త్రిప్పుచు, అమితమగు గారాబముగా పెంచెను. శ్యామలకు చీమచిటుక్కు-మన్న ఆవేదనను వాడు తనహృదయమందు నూరురెట్లు ఎక్కుడుగా అనుభవించును. ఆతనియెడ శ్యామలకును అట్టియభిమానమే. ఇంటిలో ఎప్పుడైనను రామారావుగారును, ఆతని గృహిణియును శ్యామల వివాహవిషయమై మాటలాడుకొనుట వెంకడిచెవులయందు పడినచో, వాడు పెరటిలోనికి జని ఎవ్వరును చూడకుండ ఏడ్చి, ఎవ్వరైన వచ్చినచో తనకన్నులు తొందరగా తుడుచుకొని ఎప్పటివలె, ఏదోపని చేయుచుండినవానివలె నటించుచుండువాడు. తాను గారాబముగా పెంచిన శ్యామలమ్మ అత్తవారింటికి బోయినపిమ్మట వృద్ధుడగు వెంకడు కాలము గడుపుటెట్లు? ముందెన్నడో శ్యామల అత్తవారింటికి బోవునని వెంకడు రామారావుగారికంటెను ఎక్కుడదుఃఖ మనుభవించుచుండెడువాడు. ఒకనాడు వెంకడు రామారావుగారివద్దకు పోయి "బాబూ! శామలమ్మగోరికి పెల్లి సేస్తే, ఆయమ్మ అత్తోరింటి కెల్లేటప్పుడు నానుకూడా ఆయమ్మయెంట ఎల్లిపోతాను. శామలమ్మగోరు దగ్గర లేకుంటే నాపానాలు నిలవవు బాబయ్యా". అని గద్గద స్వరముతో బలుక, రామారావుగారు, "వెంకా! శ్యామలఅత్తవారు నిన్నుకూడా వాళ్లింట్లో పెట్టుకోనేటందుకు ఒప్పుకోకపోతేనో?" అని ప్రశ్నించిరి. అందుకు వెంకడు, "వెంకడు సోమరిపోతులాగ కూకోని బోంచెయ్యడు, బాబయ్యా! సెమటూర్చి, కష్టపడి మరీ కూడు తింటాడు. మీకు తెల్దా ఏంటి? నా నక్కడి కెల్లి ఇంట్లో పనిపాట్లు సేస్తూంటే వూటకు పెట్టరన్నం ఈముసిలోడికి ఎయ్యకుంటారా? ఎయ్యకుంటే శామలమ్మగో రూరుకుంటారా? ఎంకడు కూడు లేక సస్తూంటే శామలమ్మగో రూరుకోరు. నాకు తెల్చును," అని ప్రత్యుత్తర మొసంగెను. ఆమాటలకు రామారావుగారు చిరునవ్వునవ్వి, ఆశ్చర్యపడిరి. ఇంతనమ్మకముగా కష్టపడి పనిచేయుచుండు వెంకడియందు రామారావుగారికి చాలవిశ్వాసము. ఆకారణముననే వెండిగిన్నె విషయమై ఆతడు మరేమియును మాటలాడకుండెను. కాని వెండిగిన్నె పోయినదినముననే, ఆతడు కోపముపట్టలేక "వెంకడు తీయకున్న, వెండిగిన్నెను తీయువా రెవ్వ"రని యూహించి, వెంకడిని తిట్టి దండించియుండిరి. కాని అంత కెక్కువేమియును చేయలేదు. చేయదలచుకొనియుండలేదుకూడను. "పోలీసు, గీలీసు" అని కొంచమైనను బెదరించియుండలేదు. అయినను వెంకడికిమాత్రము, నాటి రామారావుగారి మాటలకు మూడు ప్రాణములు పోయినవి. వెంకడిపరాభవమునకు శ్యామల పరితపించియుండెను.

3

రెండుదినములనుండియు వెంకడు పనిచేయుటకు రామారావుగారియింటికి రాలేదు. వాడు వారియింట్లో కొలువుకుదురుకొన్న తరువాత పనికి రాకపోవడం ఇదే మొద

...ారి. ఇదే కడసారికూడను. రామారావుగారు, వెండిగిన్నె దొంగతనం తనమీాద ఆరోపణచేసిన సాయంకాలమే వెంకడికి జ్వరము వచ్చియుండెను. వాడు తత్క్షణము తనయింటికి పోయి పండుకొనెను. మరునాడు పనిచేయుటకు వాడు రాలేదు. మూడవనాడును వచ్చుటలేదు. శ్యామలకు ఆతురత ఎక్కువైనది. వెంకడికి జ్వరము వచ్చియుండెనని ఆమెకు తెలిసియుండెను; కాని కొలది కాలములోనే వానిదేహము స్వస్థతను జెందగలదని యూహించియుండెను. కాని మూడవనాడుకూడను వెంకడు రాకపోయెసరికి శ్యామలమనస్సులో అనేక ఆలోచనలు పుట్టినవి. వెండిగిన్నె దొంగతనము వానిపై ఆరోపింపబడిన కారణమున వెంకడు నొచ్చు...ని పనికిరాకపోయెనని శ్యామల ఊహించి...ది. వెంకడు నిరపరాధియని ఆమెకు గట్టి...మ్మకము. తనతండ్రి అకారణముగా, ముసలి...కరును తిట్టి దండించినందులకు వ్యసన...డినది. వెంకడు నిర్దోషియని ఋజువు...యుటకు నానావిధము లాలోచించుండెను. యుపాయమును తోచలేదు. పెరటిలోనికి ...ి ఈవిధమున తలపోయ నారంభించినది. ఈశ్వరుడు మానవుల నందరిని ఒక్కతీరున ...జించినప్పటికిని కొందరు యజమానులని ...ను, కొందరు భృత్యులనియు నేల యుండ...యునో? ఈశ్వరుని కరుణారసపూరిత ప్రపంచమునం దిట్టి నియమ మేలయుండ...యును? ఒకమానవునిపై వేరొకమాన...కి గలయధికారమేమి? భృత్యులును, యజమానుల వలెనే మానవులై యుండ, ఒకరినొకరు శిక్షించుట కెట్టిహక్కు కలదు? ఆహా! ప్రపంచమున న్యాయవిచారముపేర ఎట్టి అత్యాచారములుజరుగుచున్నవి! న్యాయమూర్తులు న్యాయవిచారము గావించిరనుకొని, ఎందరునిర్దోషులను విగతజీవులుగా నొనర్చుచున్నారు! నిజమగున్యాయమునకును సాంసారిక న్యాయమునకును ఎంతవ్యత్యాసమున్నది! వెంకడిని నాయనగారు నేల దండింపవలయును? అట్లు దండించుట కాతని కేమి యధికారము కలదు? నాయనగారు చనవుచే నట్లు గావించినను, వెంకడి కిపుడది మనఃకంటకమైనదే! వెంకడు స్వాభిమానముచే తిరిగి పనిచేయుటకు రాలేదు. ఇన్నిదినముల నుండియు విశ్వాసముగా పనిచేయుచున్న నాకింతటియవమానమా అనుమనోవ్యాకులతకు బొల్పడి తనగృహమునందే యున్నాడు.—ఏమైనను సరియే. వెంకడి నిర్దోషత్వము బైలు పెట్టెదను. ఈవిషయమును తుదముట్టువరకును పరిశీలించెదను" అని దృఢనిశ్చయము చేసికొని ఈరీతినాటి విషయములన్నియును చర్చింప సాగెను.—

"మొన్న నేను తలంటుకొని, దుద్దులు కడిగి చెవులకు పెట్టేసుకొని, వెండిగిన్నె నూతిదగ్గరనే విడిచియుంటిని. తరువాత నేను తలతుడుచుకొని, అమ్మతో యింట్లోకి వెళ్లి పోయినాను. ఆతరువాత వెంకడు పెరటిలో పనిచేయుటకు వచ్చియుండెను. అందుచేత వెండిగిన్నె ఈమధ్యలోనే పోయిఉండాలి.—

ఒకవేళ అంట్లదిగానీ పెరటితలుపు తీసివుంచడం చూసి పట్టుకుపోయిందేమో! లేక—"

ఇంతలో పొరుగింటావిడ అన్నపూర్ణమ్మ, తనచీరకొంగులో కుడిచేయి దాచుకొని, పెరటితలుపుతీసుకొని వచ్చింది. "ఏమే, శ్యామలా, మీఅమ్మేదీ?" అని అన్నపూర్ణమ్మ ప్రశ్నించెను. శ్యామల త్రుళ్ళిపడి చూచి, "అన్నపూర్ణత్తా, మీరా? ఏ మిలాగొచ్చారు?" అనెను. అన్నపూర్ణమ్మ చీరకొంగులోనుంచి వెండిగిన్నెతీసి—" ఇది మీదేనా?" అని ప్రశ్నించెను.

శ్యామల వెండిగిన్నె నాతురతతో తన చేతులం గొని, పరీక్షించి—"అత్తా, ఇది మాదేను. ఇదిగో 'వి. రా' అని నాయనగారి విలాసం క్రింద కనిపిస్తూంది. ఇది చిన్నప్పుడు నాన్నగారు నాకు బొమ్మరింట్లోకి చేయించినారు. ఇది మీ కెక్కడ దొరికింది?

అన్న—మా పెరట్లో పాదుగొప్పులో దొరికింది. ఏదో కాకి తెచ్చిపడేసినట్టు కనిపిస్తుంది.

శ్యామలకు నిజం తెలిసిపోయింది. ఆ రోజున తను ఇంట్లోకి పోవుటకును, వెంకడు పెరట్లోకి వచ్చుటకును లోపల కాకి వెండిగిన్నె ముక్కున బెట్టుకొని, ఎగిరిపోయి, పొరుగున అన్నపూర్ణమ్మగారిపెరట్లో ప్రమాదవశాత్తూ పడేసుంటుందని ఊహించింది.

'ఇదిగో 'వి. రా.' అని నాయనగారి విలాసం క్రింద కానిపిస్తూంది.'

వెండిగిన్నె పట్టుకుని మరి మాటలాడకుండా పెరటి త్రోవనే వెంకడింటికి బయలు దేరింది.

౪

వెంకడికి నిజముగా జ్వరమే. శ్యామల వెళ్లేసరికి వాడికి శరీరముమీద స్పృహ లేదు. క్రింద పండుకొని గాభరాగా అటూ ఇటూ దొర్లుతున్నాడు. శ్యామల పోయి చూచింది. కన్నీరు విడిచింది. వెంకడు కొంచం కన్నెత్తి శ్యామలవైపు చూశాడు. ఏమో మాటలాడుతున్నాడు. మాటలు సరిగా తెలియు లేదు.

...గ్రంథాలయము
నమోదు సంఖ్య...

అస్పష్టముగా నున్నాయి. మాటకూ మాటకూ సంబంధం లేకుండా వుంది. "అయ్యో—వెండిగిన్నె—శ్యామలమ్మగోరూ—అబద్ధము—నాకుతెల్దు—బాబయగోరు కోంపడ్డారు—సిగ్గు — అవమానం — అయ్యో" శ్యామల కన్నీరు కాల్వలై పారుతూంది. తన తండ్రి రామారావు పంతులుయొక్క అకారణ మగు క్రూరవాక్కులు వెంకడి హృదయమును భేదించినవి

"వెంకా, వెంకా, వెండిగిన్నె దొరికింది, నీవు నిర్దోషివి."

గదా యని దుఃఖించినది. తుదకు వెంకడు నిరపరాధుడయ్యెను, నిష్కారణముగ మనోవ్యాధిచే పీడింపబడుట చూచి, శ్యామల వానిబాధ నివారించునుద్దేశముతో, వెండి గిన్నెనెత్తి వెంకనికండ్లయెదుట బెట్టినది. "వెంకా, వెంకా, వెండిగిన్నె దొరికింది, నీవు నిర్దోషివి. భయములేదు. నీవు వ్యాకులపడ నలదు" అని చెప్పనది. వెంకడు వెండిగిన్నె చూచాడు. శ్యామలమాటలు విన్నాడు. "అబ్బ—ఉశ్శ్—అమ్మయ్య—ఇంక—నేను—నిశ్చింతగా— ప్రాణాలు వొదితే స్తాను—ఆ—ఆ—" అని కండ్లుఎప్పటికిని మూసుకొనెను. వెంకడి జీవితకాలము సమాప్తమై పోయినది. శ్యామల దుఃఖమునకంతములేదు.

"నాన్నగారూ, ఇదిగో వెండిగిన్నె"

౫

శ్యామల మెల్లగా ఇంటికి వచ్చింది. తండ్రి రామారావుగారు చావడిలో కూర్చుని వ్రాసు

కుంటూన్నారు. "నాన్నగారూ, ఇదిగో వెండిగిన్నె" అని గిన్నె నాతనియెదుట నుంచి, కరుణరస ముట్టిపడుదృష్టులచే నాతనివైపు జూచుచు నిలువబడెను.

రామారావుగారు—వెండిగిన్నె ఎక్కడ దొరికింది?—వెంకడిఇంటిలోనా?—

శ్యామల— (దుఃఖము, క్రోధము సూచించుచు) వెంకడింట్లో ఏమియును లేదు. వెంకడింటిలో కేవల మంధకారము. ఈ వెండి గిన్నె పొరుగు అన్నపూర్ణత్తిగారింట్లో పడి యుండెనట. ఆమె ప్రొద్దున్న తెచ్చియిచ్చింది.

రామా—అలాగైతే వెంకడి కిప్పుడే కబురుపెడతాను. పాపం! ముసలాడిని నిష్కారణం కోప్పడ్డాను. వాడు పనిచెయ్యడానికి రావడం మానుకున్నాడు.

శ్యామ—వెంకడి కిప్పుడు మీకబురు అందదు.

రామ—ఏమి?

శ్యామ— వెంకడు చనిపోయినాడు. (భోరున నేడువసాగెను.) రామారావుపంతులు తెల్లబోయెను.

సంపూర్ణము

అణఁగియున్నాఁడ నేఁడు దివాంధమట్లు

వింజమూరి రంగాచార్యులు గారు, యమ్. ఏ., బి. యల్.

నవనవోత్సాహ భావకందళము లూలయ
పండు టామని కన్నులపండు వయ్యె;
ప్రత్యుషః పద్మహేళిభాస్వన్మయూఖ
పాళి మొగఁబ్రాకి జగమెల్ల మేలుకొలిపె. ౧

కలకలారావసంకులంబుల ఖగంబు
లవధరించెడు స్వేచ్ఛావిహారములను,
అటులె యానందవీథి వాహ్యాళిసలుప
వెక్కలే యాఁడవయ్యె నా కక్కటకట!. ౨

సలలితోత్సాహ ఝుంకారములు సెలంగ
నమృతరసమాను నల్లదే! భ్రమరచయము;
తద్రసాస్వాద భాగ్య మింతయును బడయ
రసన రుచిదప్పె జ్వరతప్త రసనవోలె. 3

సమయ సముచిత నవ్యమంత్రముల బుధులు
సన్నుతులొనర్తు రిదె జగచ్చక్షువునకు!
తత్సుకృతపాక దూరవర్తనుఁడ నయ్యె!
లేవలేనైతి నక్కటా! చేవదక్కి. ౪

క్రొంజిగురు ల్గాని గొంతెత్తి కోకిలములు
ప్రణయపరవశగీతముల్ పాడుచుండె;
నవ్య తద్గానలహరిఁ గంఠమ్ము గలుపఁ
దూలె, నాస్వర మక్కటా! తూలిపోయె. ౫

దేశమెల్లెడ దివ్యదీధితుల నించు
ధన్యసంపూర్ణ నవ్య చైతన్యమందుఁ
బాలుగొన లేక చీఁకటిమూలఁదూలి
యణఁగి యున్నాఁడ నేఁడు దివాంధమట్లు. ౬